మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న సంక్షేమ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్ : వివేకానంద నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ-ఎల్లమ్మ ఆలయ సమీపంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన జగన్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యం, సంతోష్, పత్తి సతీష్, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

30 సంవత్సరాలుగా ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గం

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ మర్రి నారాయణరెడ్డి నగర్ సంక్షేమ సంఘం ఎన్నిక సోమవారం జరిగింది. కాలనీలోని సంక్షేమ సంఘం భవనంలో జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా సంధి గోవర్ధన్ రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1995 నుంచి నేటి వరకు 30 సంవత్సరాల పాటు ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి వసతి వంటి సమస్యలను తీర్చడంలో గోవర్ధన్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. ప్రధాన కార్యదర్శిగా పి శంకర్, కోశాధికారిగా జి భరత్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్ కుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

దాడికి నిరసనగా కాంట్రాక్టర్ల నిరసన



నిరసనలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

జగద్గిరిగుట్ట : చార్మినార్ జోన్‌లో కాంట్రాక్టర్ మహ్మద్ ఇసాక్‌పై జరిగిన దాడికి నిరసనగా జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఒకరోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్‌లో పనులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జంట సర్కిళ్ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రేపన్ గిరిబాబు, ఉపాధ్యక్షులు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, బొంత ఎల్లయ్య, రంగరాజు, రమేష్, అశోక్, దుర్గయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. అదే విధంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

పాఠశాలకు వాటర్ మోటారు అందజేత



వాటర్ మోటార్‌ను అందజేస్తున్న హైత్వి

చింతల్: రంగారెడ్డి నగర్‌కు చెందిన ఆలేటి సురేష్ గౌడ్- సౌమ్యల కూతురు హైత్వి జన్మదిన వేడుకలను సోమవారం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హైత్వి దాచుకున్న పాకెట్ మనీ రూ.5 వేలతో వాటర్ మోటార్‌ను పాఠశాల హెచ్ఎం కల్పనకు అందజేశారు. కార్యక్రమంలో యాదిరెడ్డి, సుధాకర్, సురేష్ గౌడ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు రాక గొంతెండుతోంది

- 13 రోజులుగా వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో నీటి కట కట
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వేసవి ప్రారంభంలోనే ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ముందు ముందు ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. నెల రోజులకు ఒక్కసారి అయినా నీటి సరఫరా అవుతుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 13 రోజులుగా తాగునీరు రాక గొంతు ఎండుతోందని వైష్ణవి ఎన్‌క్లేవ్ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని సరైన సమయానికి సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.



కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయం..

చింతల్: జీడిమెట్ల సెక్షన్ వైష్ణోయ్ ఎన్‌క్లేవ్‌కు ఇప్పటి వరకు సుమారు నాలుగు విడతలు నీటి సరఫరా అవ్వాలి. ఒక్కసారి కూడా కాలేదు. సోమవారానికి సుమారు 13 రోజులకు పైగానే దాటింది. దీంతో ఆ కాలనీ వాసులు తాగడానికి గుక్కడు నీరు అందించండి మహాప్రభో అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మరమ్మతుల పేరుతో లోప్రెషర్ కారణంగా కొంతమేర తగ్గగా.. వేసవి ప్రభావం కారణంగా మరింత నీటి కష్టాలు పెరిగే అవకాశాలు నెలకొన్నాయి. వైష్ణవి ఎన్‌క్లేవ్ కుత్బుల్లాపూర్‌కు అల్వాల్‌కు సరిహద్దుగా ఉండడం.. అదేవిధంగా ఈ కాలనీ అన్ని కాలనీల కంటే ఎత్తులో ఉండటంతో నీటి సరఫరా కావడం లేదు. అంతేకాకుండా డిమార్ట్ నుంచి కాలనీ వరకు ఉన్న రెండు కిలో మీటర్ల పరిధిలో ఒక ఏరువాలు కూడా లేక పోవడం నీటి కటకటకు మరింత ఆజ్యం పోసినట్లైంది. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ వ్యవస్థను మార్చి తాగునీరు సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం

జీడిమెట్ల సెక్షన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌కు అల్వాల్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా అవుతుంది. రిజర్వాయర్ నుంచి కొంత భాగం ఓఆర్ఆర్ వెలుపల ఉన్న గ్రామాలకు నీటిని మళ్లించడంతో కుత్బుల్లాపూర్‌కు కొంతమేర నీటి ప్రెషర్ తగ్గింది. గోదావరి ప్రధాన పైపులైన్‌కు చేపట్టనున్న మరమ్మతులతో కొంతమేర ఉపశమనం కలగనుంది.

– రాజేష్ డీజీఎం కుత్బుల్లాపూర్.

ప్రజల సౌకర్యార్థమే బస్ సౌకర్యం

- బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

దుండిగల్: ప్రజల సౌకర్యార్థమే నూతన బస్సు సౌకర్యం ప్రారంభించామని బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి నగరంలోని సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నివసించే నిరుపేదలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని గుర్తు చేశారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే డి పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గతంలోనే బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, సర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుండిగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మూడు వారాల పాటు జరిగిన ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో శ్రీ కృష్ సేన టీంపై వైల్డ్ ఈగల్స్ జట్టు విజయం సాధించింది. ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.6 వేలు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నల్తూరి కృష్ణ, నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఆకుల ప్రేమకుమార్, దొంతి మహేశ్, మల్లిపెద్ది నాగరాజు, తక్కెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



అడిషనల్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న సతీష్

నిజాంపేట్ : ప్రభుత్వ భూములను, పార్కులను పరిరక్షించాలని బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్ సర్వే నంబర్ 153, 154, 155, 162 ఎస్ఏఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో నాలుగు పార్కులు, రోడ్లు, కమ్యూనిటీ స్థలంలో అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం, మల్లంపేట గ్రామం సర్వే నంబర్ 170లో 12 ఎకరాలను ఓ వ్యక్తి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని సోమవారం అడిషనల్ కలెక్టర్‌కి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్ల విలువగల ప్రభుత్వ భూమిని, పార్కును ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పాండు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

జగద్గిరిగుట్ట : డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని అన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు జైహింద్, వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, దత్తాత్రేయ, అంజయ్య నగర్ సొసైటీ అధ్యక్షులు శంకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు విట్టల్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, నాగరాజు, నాని, జై క్రిష్ణ, యాదగిరి, మనోజ్, రాజు, సాయిలు, ఆజం, విఘ్నేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 3 ఫిర్యాదులు

జగద్గిరిగుట్ట : కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 3 ఫిర్యాదులు వచ్చాయి.

- గాజుల రామారం సెక్షన్ వీనస్ ఎన్‌క్లేవ్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వీలైనంత తొందరగా సమస్యకు పరిష్కారం చూపాలని ఆ కాలనీకి చెందిన ప్రతాప్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- సూరారం సెక్షన్ రామలీల మైదాన్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ పాత పైపులైన్‌తో నిత్యం పొంగి పొర్లుతుందని, కొత్త పైపులైన్ వేయాలని శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు.
- చింతల్, పద్మానగర్ కాలనీ ఫేజ్ 1 అసోసియేషన్ సభ్యులు నీటి సమస్యపై పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు వివరించారు. వారం రోజుల్లో పర్యటించి నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని డీజీఎం రాజేష్ హామీ ఇచ్చారు.

నోటీసులు జారీ

జగద్గిరిగుట్ట : హైడ్రా ఆదేశాల మేరకు జగద్గిరిగుట్ట కొండపై సంఘాల పేర నిర్మాణాలకు, ఇతర ఆలయాల పేర ప్రహరీ నిర్మాణం చేపట్టినవారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులామ్ ఖలీం ఆధ్వర్యంలో సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీ లోగా సరైన పత్రాలు చూపాలని ఆదేశించారు. కొండపై ఉన్న కురుమ సంఘం, గౌడ సంఘం, యాదవ సంఘం, రెడ్డి సంఘం, వైశ్య సంఘం, శనీశ్వర, సమ్మక్క సారలమ్మ, తుల్జా భవానీ ఆలయాలు, మానికేశ్వరి మాత, మార్కేండేయ ఆలయ ప్రహరీ నిర్మాణాలపై, గోశాల నిర్మాణం, ఇంకా అక్రమంగా వెలిసిన వాటికి నోటీసులు జారీ చేశారు.

కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



కుత్బుల్లాపూర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పలువురు కలిశారు. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కేసీఆర్‌ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కుబడిగా ప్రజావాణి



గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫిర్యాదుదారులు

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నామమాత్రంగా దరఖాస్తులు అందుతున్నాయి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వారం రోజుల్లో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో మొత్తం 7 ఫిర్యాదులు అందాయి. మూడు టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ 3, భూగర్భ డ్రైనేజీ ఒకటి ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని పరిష్కరించాలని ఉన్నత అధికారులు చెబుతున్నా.. కింది స్థాయి సిబ్బంది మాత్రం తమ పరిధి కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ఫిర్యాదులు లేక వెల వెల పోతుంది. ఇప్పటికైనా అధికారులు గతంలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటే ప్రజల్లో అధికారులపై నమ్మకం కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్ : బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం బాచుపల్లి సిగ్నల్ పరిధిలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్‌రెడ్డి, జగదీష్ యాదవ్, సురేష్‌రెడ్డి, చిట్ల దివాకర్, శ్రీశైలం యాదవ్, వీరబాబు, జవీన్‌యాదవ్, జగన్, టేకుల ప్రవీణ్‌రెడ్డి, రవిగౌడ్, సత్తిరెడ్డి, మధురెడ్డి, రాజేందర్, అలాటి శ్రీను, శంకర్, నారాయణ, కె.నవీన్, రమేష్, జీతయ్య, శ్రీరామ్‌రెడ్డి, ప్రవీణ్, మల్లికార్జున్, రామ్‌చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తి.. మొక్కులు చెల్లించి



బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మేడ్చల్ జిల్లా మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సురేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మన్నె శేఖర్, చింత మల్లేశ్, వీరేశం గౌడ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెరగాలి



సాక్షి, సిటీబ్యూరో: సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. నగరానికి చెందిన ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం గండిపేట క్యాంపస్ నుంచి ట్రాఫిక్ సేఫ్టీ ర్యాలీని నిర్వహించారు. స్కూల్ అకడామిక్ హెడ్ శ్రీలత డోంగ్రే జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీలో ట్రాఫిక్ భద్రతకు సంబంధించిన నినాదాల ప్లకార్డులతో యువత బైక్స్‌పై ఉత్సాహంగా పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు జారీ చేసిన వైద్యాధికారులు

నిజాంపేట్: బాచుపల్లి పరిధిలో ఎలాంటి అర్హత లేకుండానే ఒక లేడీ డాక్టర్ రోగులకు వైద్యం చేస్తుంది. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శోభరాజ్ ఆధ్వర్యంలో సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 13వ తేదీన నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో డా.ఇమ్రాన్, డా.విష్ణు ప్రతినిధుల బృందం బాచుపల్లిలోని బుచ్చిబాబు క్లినిక్‌తో పాటు మల్లంపేటలోని పలు క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. సోమవారం మరోసారి తనిఖీలు చేపట్టి నోటీసులు అందజేశారు.



నిజాంపేటలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ..



శంభీపూర్‌లో మాజీ కౌన్సిలర్ కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ..



సూరారం డివిజన్‌లో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో..

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



దుండిగల్ మున్సిపల్ పరిధిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కేక్ కట్ చేసి మొక్కలు నాటిన నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేసి మొక్కలు నాటారు. అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు.